కస్టమ్ జానానై!



- సర్కారుకు సీఎంఆర్ చెల్లించని మిల్లర్లు
- 67శాతం బియ్యాన్ని ప్రభుత్వానికి చెల్లించని వైనం
- ధాన్యాన్ని బయట అమ్ముకున్నట్టు ఆరోపణలు
- చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు!

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 30: రైస్ మిల్లర్లు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చెల్లింపు విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గడువు ముగిసినా బియ్యాన్ని సర్కారుకు ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు మిల్లర్లు ఐపీ పెట్టేసి, ధాన్యాన్ని అమ్మేసుకొని ప్రభుత్వానికి కోట్ల రూపాయల గండికొట్టారు. కొందరు మిల్లర్లు గత ప్రభుత్వంలో తమకున్న పరపతి తో మాట చెల్లించుకున్నారు. ఆతర్వాత కొత్త సర్కారు రావడంతో చేసేదేమీ లేక బియ్యాన్ని చెల్లించారు. మరికొందరు ఇప్పటికీ ప్రభుత్వానికి బియ్యాన్ని (సీఎంఆర్) చెల్లించలేదు. ముఖ్యంగా కాటారం మండలానికి చెందిన బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధి భర్త నిర్వహించిన మిల్లు ఏకంగా రూ. 3 కోట్లకు పైచిలుకు సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లును వేలం వేసేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది. మిల్లు వేలం వేసినా ప్రభుత్వానికి వచ్చే సొమ్ములో 10 శాతం కూడా రికవరీ కాదని అధికారులు అంటున్నారు.

రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లను మిల్లుల్లో మర ఆడించి అందులో 67శాతం బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి చెల్లించడాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అంటారు. 2022-23 ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 194 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు రైతుల నుంచి 1.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. 1.28 లక్షల మెట్రిక్ టన్నుల్లో 82,320 మెట్రిక్ టన్నులను జిల్లాలోని 25 మిల్లులకు సరఫరా చేశారు. ప్రభుత్వానికి మిల్లర్లు 1,901 ఏసీకేఎస్‌ల (290 క్వింటాళ్లు) బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా 1,877 ఏసీకేఎస్‌లను చెల్లించారు. ఇద్దరు మిల్లర్లు మాత్రం ప్రభుత్వానికి బకాయి పడ్డారు. కాటారం మండలం దామెరకుంటకు చెందిన రుద్ర రైస్ మిల్లు 11 ఏసీకేఎస్‌లు ఇవ్వాల్సి ఉంది. మొగుళ్లపల్లి మండలంలోకి సుగుణ రైస్ మిల్లు 13 ఏసీకేఎస్‌లను చెల్లించాల్సి ఉంది. ఈ ఇద్దరు మిల్లర్ల వద్ద నుంచి అధికారులు ఒక్క గింజ కూడా సీఎంఆర్ రాబట్టలేదని తెలుస్తోంది.

అమ్మేసుకుంటున్నారా..?!

సీఎంఆర్‌ను చెల్లించకుండా ధాన్యాన్ని మిల్లర్లు అమ్మేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా ధాన్యం కేటాయింపుల్లో మరోకొత్త కోణం వెలుగులోకి వచ్చింది. కాటారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నేత నిర్వహించే మిల్లు ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టమొచ్చిన విధంగా ధాన్యం కేటాయింపులు చేశారనే ఆరోపణలు వచ్చాయి. సీఎంఆర్ విషయంలో ముందు నుంచే ఆ మిల్లర్ పారదర్శకత పాటించడం లేదని తెలుస్తోంది. మరోవైపు రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరించి బయటకు అమ్మేసుకొని సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. సెంటర్ నిర్వాహకుల ద్వారా ట్రాక్ షీట్లను సృష్టించి రైతుల పేర ప్రభుత్వం నుంచి డబ్బులు నొక్కేసినట్టు తెలుస్తోంది. మరికొం త మంది రైతుల ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేసి డబ్బులు చెల్లించడంలేదనే ఆరోపణలు బీఆర్ఎస్‌కు చెందిన ఆ మిల్లర్‌పై ఉన్నాయి. మొగుళ్లపల్లి మండలానికి చెందిన మిల్లర్ సైతం ధాన్యాన్ని అమ్మేసుకొని సీఎంఆర్ చెల్లించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

రికవరీ కష్టమేనా..?

ఖరీఫ్ (2022-23)కు సంబంధించిన సీఎంఆర్ చెల్లించడంలో ఇద్దరు మిల్లర్లు పూర్తిగా చేతులెత్తేసినట్లు సమాచారం. ప్రభుత్వం ఇచ్చిన గడువు ఫిబ్రవరితో ముగియడంతో అధికారులు చర్యలు సిద్ధమవుతున్నారు. మొగుళ్లపల్లిలోని సుగుణ రైస్‌మిల్ 13 ఏసీకేఎస్‌లు, కాటారం మండలం దామెరకుంటలోని రుద్ర రైస్ మిల్లు 11 ఏసీకేఎస్‌ల సీఎంఆర్ ఇంకా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం విధించిన గడువు కాస్త ముగియడంతో మిల్లర్ల నుంచి రికవరీ చేసే చర్యలను అధికారులు ఇప్పటికే ప్రారంభించారు. ఈ రెండు మిల్లుల్లో ధాన్యం ఉందా.. లేదా..? అనే కోణంలో విచారణ చేపట్టారు. దీంతో పాటు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో మిల్లులు ఉన్న స్థలాలపై ఎలాంటి క్రయవిక్రయాలు జరగకుండా చూడాలని నోటీసులు కూడా ఇచ్చారు. మరోవైపు స్థానిక పోలీస్‌స్టేషన్లల్లో కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. సుగుణ రైస్ మిల్లు నుంచి రికవరీ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ రుద్ర రైస్ మిల్లు నుంచి రికవరీ అధికారులకు కష్టంగా మారింది. ప్రభుత్వానికి ఆ మిల్లు రూ. 3 కోట్లపైగా చెల్లించాల్సి ఉండగా అందులో 10 శాతం రికవరీ కూడా కష్టమే అని అధికారులు చర్చించుకుంటున్నారు.

రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు

- రాఘవేందర్, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్



జిల్లాలో సీఎంఆర్ చెల్లించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. మిల్లులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును వసూలు చేస్తాం. చెల్లించాల్సిన సొమ్ముకు స్వాధీనం చేసుకున్న మిల్లు విలువ సరిపోకపోతే ష్యూరిటీగా ఉన్న మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి చెల్లింపులు చేయిస్తాం.



వంగరలో పీవీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

భారతరత్న పీవీ..

- పురస్కారాన్ని బహూకరించిన కేంద్రం
- రాష్ట్రపతి ముర్ము నుంచి అందుకున్న మాజీ ప్రధాని కుమారుడు ప్రభాకర్‌రావు



రాష్ట్రపతి నుంచి భారతరత్న అవార్డు అందుకుంటున్న పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు

భీమదేవరపల్లి, మార్చి 30 : మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని బహూకరించింది. శనివారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం నలుగురికి భారతరత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అందజేయగా.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు గాను ఆయన కుమారుడు ప్రభాకర్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రభాకర్‌రావుతో పాటు ఆయన సోదరి సురభి వాణీదేవి, మనువడు కష్యప్ కూడా వెళ్లారు. ఇక పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారాన్ని బహూకరించిన నేపథ్యంలో వంగరలోని పీవీ నివాసంలోని పీవీ విగ్రహానికి స్వామి రామానందతీర్థ సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి, కాంగ్రెస్ నాయకులు చిదురాల స్వరూప, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒల్లాల రమేష్, చెప్యాల చందారెడ్డి, శ్రీరామోజు మొండయ్య, రాంబాబు, సమ్మయ్య, రామకృష్ణ, లావణ్య తదితరులు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగుతేజం పీవీ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, మచ్చ లేని వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలే నేడు దేశాన్ని పటిష్ఠంగా నిలిపాయని గుర్తుచేశారు.

నేడు జనగామ జిల్లాలో కేసీఆర్ పర్యటన



జనగామ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పులకు వస్తున్నారు. ఎండిన పంటల పరిశీలనలో భాగంగా ఆయన జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో ఎండిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి జనగామ మీదుగా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాకు 10.30 గంటలకు చేరుకుంటారు. సుమారు అరగంట పాటు పంటలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలానికి వెళ్తారు.

నేను చెప్పినట్టు చేయాల్సిందే..

- కాదంటే కలెక్టర్‌తో మాట్లాడిస్తా...
- అధికారులకు డిప్యూటేషన్ ఉద్యోగి హుకుం
- వైద్యశాఖలో బంధువుకు దొడ్డిదారిన పోస్టింగ్ కోసం ఒత్తిడి

ములుగు, మార్చి 30: 'నేను చెబుతున్నానంటే.. అది కలెక్టర్ చెప్పినట్టే. కాదంటే చెప్పండి.. కలెక్టర్‌తోనే మాట్లాడిస్తా. కాకపోతే మాత్రం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది' అంటూ కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగి జిల్లా అధికారులు, ఉద్యోగులపై ఆజమాయిషీ చెలాయిస్తున్నాడు. పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగిగా ఉంటూ డిప్యూటేషన్‌పై కలెక్టర్ వద్ద పనిచేస్తున్న ఆ వ్యక్తి ఓవర్ యాక్షన్‌తో అధికారులు విసిగి వేసారిపోతున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయలేక, ఎవరికీ చెప్పుకోలేక లోలోపల మదనపడుతున్నారు. ఇప్పుడీ విషయం జిల్లా అడ్మినిస్ట్రేషన్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తన మాట వినని అధికారులపై కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు చాడీలు చెబుతూ తప్పుదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి బలాన్నిచ్చేలా ఇటీవల జరిగిన ఓ సంఘటనపై చర్చ జరుగుతోంది.

ఏటూరునాగారం ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో 20ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగిపై అపరిచిత వ్యక్తులతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించి చివరకు అతడిని ఉద్యోగం నుంచి తొలగిం పజేశాడు. అంతకు ముందు ఇదే ఆస్పత్రిలో తన సమీప బంధువైన యువకుడికి డీఎంఎఫ్‌టీ (కలెక్టర్ ఫండ్)లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం ఇప్పించాడు. సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌ను ఉద్యోగం నుంచి తొలగింపచేసేలా పావులు కదిపిన అతడు ఖాళీ అయిన ఆస్థానంలో తన బంధువుకు పోస్టింగ్ ఇవ్వాలంటూ వైద్యఆరోగ్య శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నాడు.

కలెక్టర్ సిఫారసు లెటర్‌తో ఇటీవల ములుగులోని కార్యాలయానికి వెళ్లి సంబం ధిత అధికారులపై జులుం ప్రదర్శించినట్టు సమాచారం. 'మా వాడి కోసం ఓ పోస్టును ఖాళీ చేయించిన.. కలెక్టర్ గారి సిఫారసు లెటర్ కూడా సంపాదించిన.. మధ్యలో మీరేంది? పాత డేట్ వేసి నియామక ఉత్తర్వులు ఇవ్వండి..' అంటూ పెత్తనానికి పోయినట్లు తెలిసింది. గతంలో కలెక్టర్ ఫండ్‌లో జరిగిన నియామకమే నిబంధనలకు విరుద్ధమని, కాంట్రాక్టు ప్రాతి పదికన భర్తీ చేయాల్సిన ఖాళీకి ప్రాథమిక నోటిఫి కేషన్ ఇవ్వాల్సి ఉంటుందని, కలెక్టర్ సిఫారసు లెటర్‌తో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేమని వైద్యవిధాన పరిషత్ అధికారి వివరణ ఇచ్చారని తెలిసింది.

దీంతో తీవ్ర కోపోద్రిక్తుడై ఆ వ్యక్తి వారికి వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. కేడర్ పరంగా తక్కువే అయినప్పటికీ కలెక్టర్ వద్ద పనిచేస్తున్నానన్న ధీమాతో జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులపై జులుం ప్రదర్శిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆఉద్యోగి తీరుపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని అధికార, ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి.

శనివారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 38.0°C | కనిష్ఠం : 23.0°C

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	ఆదివారం	సా : 6.34 గం..
సహర్ :	సోమవారం	ఉ : 4.48 గం..

గ్రావెల్ వ్యాపారిపై కత్తిదూసిన మాజీ ఎంపీటీసీ

- అడ్డుకోబోయిన గ్రావెల్ వ్యాపారి భార్య చేతికి గాయం
- ములుగు మండలం ఇంచర్లలో ఘటన
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మామిడి అశోక్‌పై దాడికి యత్నిస్తున్న శానబోయిన అశోక్



వసంత చేతికి అయిన గాయం

ములుగు, మార్చి 30: పాత గొడవల నేపథ్యంలో ఓ గ్రావెల్ వ్యాపారిపై మాజీ ఎంపీటీసీ కత్తితో దాడి చేసిన సంఘటన ములుగు జిల్లా ములుగు మండలం ఇంచర్లలో శనివారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మామిడి అశోక్ కొంత కాలంగా గ్రావెల్(ఎర్రమట్టి) దందా చేస్తున్నాడు. అటవీ, ప్రభుత్వ స్థలాల నుంచి పలుమార్లు అనుమతి లేకుండా మట్టి తరలించడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు వాహనాలను సీజ్‌చేసి భారీగా జరిమానాలు విధించారు. అయితే ఇదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శానబోయిన అశోక్ ఫిర్యాదు చేయడంతోనే అధికారులు తన వాహనాలను పట్టుకుంటున్నారని కోపం పెంచుకున్నాడు. ఈవిషయమై గతంలో ఇరువురి మధ్య గొడవలు జరగగా పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు కూడా చేసుకున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇదే విషయమై ఇరువురు గొడవ పడ్డారు. మామిడి అశోక్‌పై శానబోయిన అశోక్ కత్తితో దాడిచేసేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఆ సమయంలో తన భర్తకు అడ్డుగా నిలబడ్డ మామిడి అశోక్ భార్య వసంత ఎడమ చేతికి కత్తి తగిలి గాయమైంది. వెంటనే ఆమెను ములుగు ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. అయితే తొలుత మామిడి అశోక్ కొందరితో కలిసి శానబోయిన అశోక్ ఇంటిపై దాడి చేసి కారు అద్దాలు పగలగొట్టారని, దానికి ప్రతిగా శానబోయిన అశోక్ మామిడి అశోక్‌పై కత్తితో దాడికి యత్నించాడని స్థానికులు చెబుతున్నారు. ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రంజిత్ కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

భూపాలపల్లిటౌన్, మార్చి 30: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా 3,547 మంది విద్యార్థుల్లో 3,536 మంది విద్యార్థులు హాజరయ్యారని, 11 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఇందులో ఒకటి ప్రైవేటు కేంద్రం ఉంది. చివరి రోజు నాలుగు కేంద్రాలను డీఈవో రామ్‌కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మంగపేట, మార్చి 30: మండల కేంద్రంలోని గంపోనిగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్టు ఎంఈవో రాజేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి విధులకు హాజరైన ఉపాధ్యాయుడు సురటి నాగేశ్వర్‌రావు ఆ మత్తులో జోగుతూ పాఠశాలలోని టేబుల్‌పై నిద్రపోయాడనే సమాచారాన్ని విద్యార్థులు తమకు అందించారని పేర్కొన్నారు. డీఈవోకు ఈ విషయాన్ని తెలియజేయగా నాగేశ్వర్‌రావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో తెలిపారు.

కోటంచ హుండీ ఆదాయం రూ. 15,62,170

రేగొండ, మార్చి 30: కోటంచ లక్ష్మీనరసింహస్వామి హుండీలను శనివారం లెక్కించారు. జాతర సందర్భంగా భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ. 15,62,170 సమకూరిందని ఈవో శ్రీనివాస్ తెలిపారు. కరెన్సీ నోట్లు రూ.15,07,180, నాణేలు రూ.54,999, మిశ్రమ బంగారం 0.59 గ్రాములు, మిశ్రమ వెండి 2.300 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి శేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ భిక్షపతి, డైరెక్టర్లు శ్రీధర్, ఓంకార్, కోటేశ్వరరావు, ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యులు, ఆలయ ఉద్యోగులు కొమురాజు రవి, గోరంట్ల శ్రావణ్, నాగుల సుదర్శన్ పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. విద్యార్థినులకు గాయాలు



బోల్తాపడిన టాటాఏసీ వాహనం

చిట్యాల, మార్చి 30: వాహనం బోల్తా పడి ఐదుగురు పదో తరగతి విద్యార్థినులు, ఓ ఉపాధ్యాయురాలికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థినులు పదో తరగతి పరీక్షలు గురుకుల పాఠశాలలోని కేంద్రంలో రాశారు. 12 మంది విద్యార్థినులు, ఓ ఉపాధ్యాయురాలు పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు టాటా ఏస్ వాహనాన్ని మాట్లాడుకున్నారు. రోజూ లాగే శనివారం పరీక్ష కేంద్రానికి బయల్దేరారు. అక్కడికి చేరుకున్నాక వాహనాన్ని రోడ్ పక్కకు నిలిపే క్రమంలో అది బోల్తా పడింది. దీంతో ఉపాధ్యాయురాలు స్వప్న, విద్యార్థినులు పావని, గౌతమి, ప్రణీత, మమతకు స్వల్ప గాలయ్యాయి. ప్రాథమి చికిత్స అనంతరం వీరు పరీక్షకు హాజరయ్యారు. ప్రమాద విషయం తెలుసుకొని ఎంఈవో కె.రఘుపతి పరీక్ష కేంద్రానికి చేరుకొని గాయపడిన విద్యార్థినులు, ఉపాధ్యాయురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై శ్రావణ్ కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడొద్దు

- భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 20: గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడొద్దని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలోని 241 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బోర్లు,

మిగతా 8వ పేజీలో..

రాష్ట్ర సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

మొగుళ్లపల్లి, మార్చి 30: తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పోలసాని మురళీధర్‌రావు అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. దివంగత ఏబీవీపీ నాయకుడు సూరినేని భీమ్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసేందుకు అమలుకాని హామీలు ఇచ్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, నాయకులు కిషన్‌రావు, భూమారావు, జనార్దన్‌రావు, శివ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మురళీధర్‌రావు

నేడు ఉమ్మడి జిల్లా లయన్స్ సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, మార్చి 30: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 80 లయన్స్ క్లబ్‌లకు చెందిన వేడుక లయన్స్ సమ్మేళనం ప్రస్తుత 320 - ఎఫ్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో ఆదివారం వైభవంగా జరుగనుంది. హనుమకొండ ములుగురోడ్‌లోని బీఆర్ఆర్ గార్డెన్స్ వేదికగా జరిగే వేడుకల్లో లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ జి.బాబురావు, మల్టిపుల్ నాయకులు పూర్వ గవర్నర్లతో సహా సుమారు 2వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే వేడుకల్లో భాగంగా సాయంత్రం ఎస్‌వీడీజీ ఎన్నిక జరుగనుంది. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ కాకతీయ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకల విజయవంతానికి ప్రత్యేకంగా వివిధ కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున లయన్స్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈసారి ప్రత్యేకంగా పలుస్పెషాలిటీక్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. హంగర్ రిలీఫ్ పేరిట తాను ఎన్నికైనప్పటి నుంచి ఈ రోజు వరకు నిరంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ముఖ్యంగా హనుమకొండ పట్టణ ప్రాంతంలోని నాలుగు క్లబ్‌లతో పాటు జనగామ, తొర్రూరు, స్టేషన్ ఘన్‌పూర్, చేర్యాల, మహబూబాబాద్ పట్టణాలలో లయన్స్ క్లబ్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో పాలకుర్తి, మొండ్రాయి, ములుగులాంటి పలు క్లబ్‌లు మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆదివారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు బ్యాంకు సేవలు యథాతథం

వరంగల్ చౌరస్తా, మార్చి 31: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం మార్చి 31 ఆదివారంతో ముగియనున్న వేళ దేశ వ్యాప్తంగా ఆదివారం అన్ని బ్యాంకులు లావాదేవీలు నిర్వహించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఆదివారం కూడా సేవలను అందించనున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే లావాదేవీలు, నగదు, చెల్లింపు ఆర్టీజీఎస్ నెఫ్ట్, చెక్కుల చెల్లింపు, క్లియరెన్స్ లాంటి సేవలు పనిచేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్ల కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా.. బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

● ఆమోదించిన అకడమిక్ సెనెట్ సమావేశం ● విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి : వీసీ

హనుమకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.431.20కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించింది. శనివారం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన విశ్వవిద్యాలయం సెనెట్‌హాల్‌లో జరిగిన 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య పి.అమరవేణి బడ్జెట్ ప్రవేశపెట్టారు. యేడాదిపాటు ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లు, ఉద్యోగ విరమణ భత్యాలు, ఇతర ఖర్చులకు రూ.449.73కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.134.94కోట్లు, ఇతర వనరుల నుంచి రూ.296.26కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. వీటిలో యూజీసీ నుంచి బకాయిల రూపంలో రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజు రూపంలో రూ.8కోట్లు, అంతర్గత వనరుల ద్వారా రూ.24.28కోట్లు, పరీక్షల విభాగం ద్వారా రూ.58.79కోట్లు రాగలవని అంచనా వేశారు. ఖర్చులను, రాబడులను ఆచార్య అమరవేణి ఎనిమిది అంశాల్లో చూపించారు. అదే సమయంలో రూ.8.08కోట్లు లోటు ఉంటుందని వెల్లడించారు. రుసా నిధులు రూ.44కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఉద్యోగుల జీతాలకు, పెన్షన్‌లకు రూ.207.44 కోట్లు, పరీక్షలు, అకడమిక్ కార్యక్రమాలకు రూ.63.44కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య తాడికొండ రమేష్

అందరి కృషి

విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కృషి ఉందని వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేష్ తన నివేదికలో పేర్కొన్నారు. న్యాక్ ఏప్లస్ గ్రేడింగ్ సాధించడం ఒక గొప్ప అంశమని అన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత వనరులు, రాష్ట్ర ప్రభుత్వ, ఇతర సంస్థల సహకారంతో అకడమిక్, పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల సంక్షేమం, ఇత ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కెహబ్, పీవీ విజ్ఞాన కేంద్రం, పరిపాలన భవన్‌లో రెండోఅంతస్తు, డైనింగ్ హాల్, బాలికల వసతి గృహం విస్తరణ, దూర విద్య కేంద్రంలో మీడియా సెంటర్ పునరుద్ధరణ అభివృద్ధి పనుల్లో ఉన్నాయన్నారు.

ఒప్పందాలు

అకడమిక్‌పరంగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలతో, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు, జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షకు శిక్షణ చేపట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందటంలో ప్రోత్సాహం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై 40 రోజుల శిక్షణా కార్యక్రమంతో పాటు ఐదేళ్ల విరామం తర్వాత పీహెచ్‌డీ ప్రవేశాలు విజయవంతంగా నిర్వహించినట్లు వీసీ వివరించారు. రాష్ట్రపతి, గవర్నర్ నుంచి అవార్డులు పొందినట్లు తెలిపారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించామని, అలాగే విభాగాలు, కళాశాలల్లో కూడా అంతర్జాతీయ, జాతీయ సదస్సులు నిర్వహించామన్నారు.

ఉద్యోగుల సంక్షేమం

విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నట్లు వీసీ ఆచార్య రమేష్ తెలిపారు. దినసరి వేతన ఉద్యోగుల జీతాలు పెంచినట్లు తెలిపారు. క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు కూడా త్వరలో పెరుగుతాయన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన భత్యాలు, రెగ్యులర్ ఉద్యోగుల పీఆర్సీ బెనిఫిట్స్ చెల్లించామన్నారు. గవర్నర్ ఆర్డర్ల ప్రకారం పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెమ్యునరేషన్‌లు పెంచామన్నారు. పరిమిత, నియమిత ఆర్థిక, మానవ వనరులతో సమష్టి కృషితో ముందుకు పోతున్నామన్నారు.

కోర్సులు

పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, ప్రభుత్వం నిధులు, నియామకాలకు ముందుకు రావాలని, దూర విద్యాకేంద్రంలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని అన్నారు. పూర్తిస్థాయి అకడమిక్ సెనెట్ ఉండాలన్నారు. మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య విద్యావతి మాట్లాడుతూ.. పలు విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత చాలా ఉందని అన్నారు. పరిశోధనలు నిరంతరం జరగాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావొద్దని, నిధులను సమీకరించాలని అన్నారు. అకడమిక్ సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని విచారం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ పెరగడం లేదని అన్నారు. యూనివర్సిటీలు బాగుపడాలంటే నియామకాలు జరగాలని అభిప్రాయపడ్డారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడం అభినందనీయం అన్నారు. మరో అకడమిక్ సెనెట్ సభ్యుడు మాణిక్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీ పాలనలో మహిళా నాయకత్వం పెరగడం అభినందనీయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు, విశ్రాంత ఎకానమిక్స్ విభాగ ఆచార్యులు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఇక్బాల్ అలీ మాట్లాడుతూ.. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని యూనివర్సిటీ ముందుకు దుసుకొనిపోతున్నదన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి నిధులు రాబట్టాన్నారు. డీన్‌లు ఆచార్య ఎస్.రామనాథ్ కిషన్ మాట్లాడుతూ.. గెస్ట్ ఫ్యాకల్టీ నియామకంతో విద్యా విభాగం బలోపేతమైందన్నారు. స్నాతకోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ.. సమష్టి కృషితో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ విజయవంతమైందన్నారు. ఆచార్య సురేష్‌లాల్, ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య ఎస్.జ్యోతి, ఆచార్య ఎస్.నరసింహచారి మాట్లాడారు. అనంతరం సమావేశం బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది.

వార్షిక నివేదికలకు ఆమోదం

వార్షిక నివేదికలను కూడా సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోనే ఇతర విశ్వవిద్యాలయాల కంటే మెరుగ్గా ముందుకు పోతోందన్నారు. పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణలను వివరించారు. ఇటీవల మృతి చెందిన అకడమిక్ సెనెట్ సభ్యుడు పోకల చందర్ అకాల మరణానికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ దృశ్య, శ్రవణ విధానం ద్వారా మూడేళ్లలో విశ్వవిద్యాలయంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు. కేయూ పొలిటికల్ సైన్స్ విభాగపు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ గడ్డం కృష్ణయ్య నియమితులైనందుకు సమావేశం అభినందనలు తెలిపింది.

దళిత సంఘాల నిరసన

భూపాలపల్లిటౌన్, మార్చి 30: వరంగల్ ఎంపీ టిక్కెట్ కాంగ్రెస్ అధిష్ఠానం మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో భూపాలపల్లిలో శనివారం నిరసనకు దిగారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లా ప్రేంసాగర్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మాదిగల సంఖ్య అత్యధికంగా ఉందని, ఆ సామాజికవర్గానికి టికెట్ కేటాయిస్తే గెలుపు ఖాయమని అన్నారు. ఎస్సై పవన్‌కుమార్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు రేణుకుంట్ల కొంరయ్య, టీఎమ్మార్పీఎస్ నాయకుడు కొడెపాక సంజీవయ్య, నాయకులు మంతెన రాజేష్, శ్రీనివాస్, సంజీవ్, రాజమౌళి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నీటి సరఫరాపై దృష్టి సారించాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

గోవిందరావుపేట, మార్చి 30: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో నీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈమేరకు శనివారం ఆమె మండలంలోని బుస్సాపూర్, దుబ్బగూడెం, తాతయ్యపల్లి గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరా స్థితిగతులను పరిశీలించారు. ముందుగా ఆమె గ్రామాల్లో స్థానికులను నీటి సరఫరా తీరును అడిగి తెలుసుకుంటూ ప్రతిరోజూ ఎంతసేపు నీరు సరఫరా అవుతోంది... నీటి లభ్యత, అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై ఆరా తీశారు. గ్రామాల్లో ఎన్ని నల్లా కనెక్షన్లు ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి వృథాను అరికట్టాలని, అవసరాల మేరకు మాత్రమే నీటిని వినియోగించుకోవాలని అన్నారు. ఏటూరునాగారం మండలం రాంనగర్, వాజేడు మండలంలోని పూసూరు, వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సులోని పంపుహౌస్‌ల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. అధికారుల అంచనాల ప్రకారం ఇప్పటివరకు ములుగు ప్రాంతంలో ఎలాంటి తాగునీటి సమస్య లేదని, అయినప్పటికీ ప్రజలు తాగునీటిని వృథా చేయరాదని అన్నారు. గ్రామంలో ఉన్న బోరుబావుల పనితీరును గ్రామాల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మరమ్మతులకు గురైన చేతిపంపులు, బోర్లు, మంచినీటి బావులు, తదితర నీటి సరఫరా వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి హజార్ సయ్యద్, గ్రిడ్ అధికారి సంధ్యారాణి, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఎంపీవో సాజిదాబేగం, తదితరులు పాల్గొన్నారు.



దుబ్బగూడెంలో బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి, మార్చి 30: పార్లమెంటు ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రాతో మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు ఉద్యోగులందరికీ తప్పకుండా పోస్టల్ బ్యాలెట్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఫారం-12ను సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటుచేసి ఫారం-12 అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలన్నారు. ఉద్యోగుల నుంచి ఫారం -12 తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించాలని అన్నారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి 8 వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటుచేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరించాలన్నారు.



ఆకాశాన..
అద్భుత ఆవిష్కరణ

ప్రకృతి ఓ అద్భుతాన్ని ఆవిష్కరించింది. పగలంతా పయనించి తన గూటికి చేరుకుంటున్న సమయంలో సూర్యుడు వదిలిన వర్ణాలను తీసుకొంది. అంబరాన్నం తటికీ వాటిని అద్దుతూ మనోహరమైన చిత్రాన్ని గీసింది. ఈ దృశ్యం గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ వద్ద కనువిందు చేసింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

ఫ్లయింగ్‌స్క్వాడ్ బృంద సభ్యులపై కేసు

- రిమాండ్‌కు తరలింపు
- ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : జిల్లాలోని రెండ్యాలలో అక్రమ వసూళ్లకు పాల్పడిన ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం సభ్యులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తిరుపతిరావు శనివారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జిల్లాలో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 20, 21 మహబూబాబాద్ మండలం నడివాడ, గడ్డిగూడెం, సంద్రాల గూడెం గ్రామాల్లోని కిరాణాషాపుల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కిరాణ షాపుల్లో మద్యం అమ్ముతుండగా, ఎన్నికల కోడ్ ఉండగా, ఎందుకు అమ్ముతున్నారని వారిని బెదిరించారు. తర్వాత తమకు డబ్బులు ఇస్తే మీమీద కేసు లేకుండా చూస్తామని చెప్పి, రెడ్యాలలో మంచాల వేణుకు చెందిన షాపువద్ద ఫోన్‌పే ద్వారా వేణు నుం చి రూ.1500 తీసుకున్నారని, ఈ విషయం తెలుసుకున్న వేణు స్నేహితుడైన నల్లు దేవేందర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందంలోని జూనియర్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్ పలుషాపుల నుంచి నగదు తీసుకుంటూ, నగదు లేనిచోట బృందం సభ్యులైన ఫొటోగ్రాఫర్ కండె వేంకటేశ్వర్లు ఫోన్‌పేకు చేయించుకుంటున్నట్లు చెప్పారు. తర్వాత సద్దాం హుస్సేన్ ఫోన్‌పేకు తిరిగి చేయించుకుని వారు వసూలు చేసిన మొత్తం రూ.15,100ను టీమ్ లీడర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ సామ్రాజ్‌కు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈనెల 29న జూనియర్ అసిస్టెంట్ సద్దాం హుస్సేన్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ సామ్రాజ్, వీడి యో గ్రాఫర్ కండె వేంకటేశ్వర్లును అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పా రు. వీరితోపాటు టీమ్ సభ్యులైన హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, గోపిపై శాఖపరమైన చర్యలు తీసుకుని వారిని విధుల నుంచి తొలగించినట్లు డీఎస్పీ తెలిపారు.

బీజేపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుల నియామకం



యాకూబ్‌పాషా



శ్రీనివాస్ గౌడ్

మంగపేట, మార్చి 30: బీజేపీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులను నియమించారు. మంగపేటకు చెందిన ఎమ్డీ. యాకూబ్‌పాషాను మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, మండలంలోని కోమటిపల్లికి చెందిన లోడే శ్రీనివాస్ గౌడ్‌ను కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. నియామక పత్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం శనివారం అందజేశారు.

కోర్టు ప్రాంగణంలో 'ఈ-సేవ' ప్రారంభం



కోర్టు ఆవరణలో ఈ-సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి నారాయణబాబు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 30: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ-సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా జడ్జి నారాయణబాబు శనివారం ప్రారంభించారు. కేసుల స్థితిగతుల గురించి తెలుసుకునే వారు ఈ కేంద్రంలో సంప్రదించాలన్నారు. న్యాయవాదులకు, కక్షిదారులకు ఇదెంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి వసంతోత్సవాలు



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటాపురం(నూగూరు), మార్చి 30: మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా వసంతోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం చేపట్టగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పర్యటన



చెరుపల్లిలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న నాగజ్యోతి

మంగపేట, మార్చి 30: మండలంలోని కమలాపురం, గంపోనిగూడెం, బోరునర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట తదితర గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి శనివారం బీఆర్ఎస్ నాయకులతో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులను కలుసుకున్నారు. ఆమె వెంట రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజుయాదవ్, నాయకులు వత్సవాయి శ్రీధర్‌వర్మ, చిట్టిమల్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం రవాణా కేసులో నలుగురి రిమాండ్

మహదేవపూర్, మార్చి 30: మండలంలోని కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన ద్వారా మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న కేసులో నలుగురిని శనివారం రిమాండ్‌కు తరలించారు. వారం రోజుల క్రితం సుమారు 700 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బియ్యం వ్యాపారి సిరోంచకు చెందిన వీరన్‌కుమార్ అలియాస్ వీరన్నతోపాటు వాహన డ్రైవర్లు పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన పార్వతి శ్రీధర్, భూపాలపల్లి జిల్లా కొడెపాకు చెందిన బత్తుల రఘురాం, బిహార్‌లోని రంజిత్ ఖతియాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ తెలిపారు.

నల్లాలకు మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు

మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావు

భూపాలపల్లిటౌన్, మార్చి 30: మంచినీటి నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిని చాలా ఆదా చేయాలన్నారు. మునిసిపాలిటీ ద్వారా మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయొద్దని అన్నారు. ఏప్రిల్ 3 నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లో టీంలు తిరుగుతాయని, ఈ క్రమంలో ఎవరైనా మంచినీటి నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉద్యోగ విరమణ అనేది రెండో ఇన్నింగ్ : ఎస్పీ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి30: ఉద్యోగ విరమణ అనంతర జీవితం సెకెండ్ ఇన్నింగ్ లాంటిదని, వారు కుటుంబం, బంధుమి త్రులతో కలిసి సుఖసం తోషాలతో దాన్ని గడపాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ కానిస్టేబుల్స్ నారాయణరెడ్డి, వెంకటయ్య, గోపాల్‌రెడ్డిని ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ వేముల శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేష్, శ్రీకాంత్, కిరణ్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ కానిస్టేబుల్స్‌తో ఎస్పీ కిరణ్ ఖరే

చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన ఎస్పీ

భూపాలపల్లి పట్టణంలోని బాంబుల గడ్డ వద్ద ఏర్పాటుచేసిన స్టాటిక్ సర్వేలెన్స్ టీం చెక్‌పోస్టును ఎస్పీ కిరణ్ ఖరే తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలన్నారు.

ఇద్దరి బైండోవర్

టేకుమట్ల, మార్చి 30: మండలంలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను తహసీల్దార్ విజయలక్ష్మి ఎదుట పోలీసులు శనివారం బైండోవర్ చేశారు. ఈ మేరకు ఎస్సై ప్రసాద్ తెలిపారు. బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్న రామక్రిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన మంచాల మల్లయ్య, గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన కటకం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

కాటారం, మార్చి 30:మండలంలోని శంకరంపల్లి స్టేజీ సమీపంలో కాటారం-మంథని రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మహదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్ గ్రామానికి చెందిన వేమునూరి వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని మండలాని కి చెందిన సంతోష్ అనే వ్యక్తి కారులో పర్కాలకు వెళ్లి ఇంటికి తిరిగివెళ్తున్నాడు. వెంకట్‌రెడ్డి బైక్‌పై మంథనికి వెళ్లి ఇంటికొస్తున్నాడు. శంకరంపల్లి స్టేజీ సమీపంలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు ముందుభాగం, బైక్ దెబ్బతినగా వెంకట్‌రెడ్డి బైక్‌పై నుంచి ఎగిరిపడటంతో కాళ్లు విరిగాయి. క్షతగాత్రుడిని బ్లూకోల్ట్ పోలీసులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

మంగపేట, మార్చి 30: మండలంలోని కమలాపురంలో గుడుంబా స్థావరాలపై ఏటూరునాగారం ఎక్సైజ్ సీఐ ఎల్. రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 900 లీటర్ల గుడుంబా, బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి లెంకల లక్ష్మణ్‌రావు, చల్లా శ్రీనివాస్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ నవీన్, శ్రీనివాస్‌గౌడ్, వీరన్న, నాగరాజు, ప్రణవ్ పాల్గొన్నారు.

సరిహద్దులో ఖాకీల సమావేశం

మావోయిస్టుల కార్యకలాపాలపై తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీసుల చర్చ

ఇరు రాష్ట్రాల బార్డర్‌లో నిఘాను మరింత పెంచాలని నిర్ణయం

వాజేడు, మార్చి 30: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. మావోయిస్టుల కదలికలపై నిఘాను పటిష్ఠం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పేరూరు పోలీస్‌స్టేషన్‌లో ఇరు రాష్ట్రాల పోలీసులు శుక్రవారం సమావేశమయ్యారు. ఆ వివరాలను మీడియాకు శనివారం వెల్లడించారు. వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించగా వాజేడు, పేరూరు, వెంకటాపురం, ఆలుబాక ఎస్సైలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సరిహద్దులో తార్లగూడ, భద్రకాళి పోలీస్‌స్టేషన్ల సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు. పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మావోయిస్టుల కార్యకలాపాల నియంత్రణకు ప్రణాళిక తదితర అంశాలపై సమాలోచన చేశారు. రెండు రాష్ట్రాల పరిధిలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసి మావోయిస్టులపై నిఘా పెంచాలని నిర్ణయించారు. మావోయిస్టుల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా రెండు రాష్ట్రాల పోలీసులు పరస్పరంగా సహకరించుకునేందుకు అవగాహనకు వచ్చినట్టు వెంకటాపురం సీఐ కుమార్ తెలిపారు.



సమావేశంలో ఇరు రాష్ట్రాల పోలీసులు

ఈ సమావేశంలో వాజేడు, పేరూరు, వెంకటాపురం, ఆలుబాక ఎస్సైలు చవల్ల వెంకటేశ్వరరావు, గొర్ల రమేష్, రేఖ అశోక్, కొప్పుల తిరుపతిరావు, తార్లగూడ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హుబులాల్ చంద్రకార్, భద్రకాళి ఇన్‌స్పెక్టర్ సత్యవతిసహు, ఎస్సైలు మహేశ్వర శంకర, సురేష్‌బిన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ

రాజయ్యను పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాయబారం

రాంనగర్, మార్చి 30: వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అరూరి రమేశ్ బీజేపీలో చేరడం, ఆ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య తాను పోటీచేయలేనంటూ తప్పుకోవడం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవడం బీఆర్ఎస్ శ్రేణులను గందరగోళంలో పడేశాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక కోసం అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. బీఆర్ఎస్‌ను వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించగా.. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాయబారం నడుపుతున్నట్టు తెలిసింది. రాజయ్యను ఒప్పించిన పల్లా.. మాజీ సీఎం కేసీఆర్ వద్దకు ఒకటిరెండు రోజుల్లో రాజయ్యను తీసుకెళ్లే అవకాశాలున్నట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్‌లో చేరాలనుకున్న రాజయ్యకు ఆ పార్టీ నుంచి ప్రతికూల పరిస్థితులు రావడంతో తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఇక నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న కూడా వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తుండగా.. ప్రస్తుతం ఆమె వరంగల్ జడ్పీ బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. డాక్టర్ రాజయ్య, పెద్ది స్వప్న ఇద్దరిలో ఒకరికి బీఆర్ఎస్ టికెట్ వచ్చే అవకాశాలున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే ఉద్యమకారుల్లో మాజీ కార్పొరేటర్లు బోడ డిన్నా, జోరిక రమేశ్, చింతల యాదగిరితోపాటు వీరేందర్, బైరి నిరంజన్ పోటీ పడుతున్నారు. వీరిలో బోడ డిన్నా శనివారం ఎర్రవెల్లికి వెళ్లి కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. జోరిక రమేశ్‌తో పాటు మిగతా వారు తమ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కాగా ఆదివారం కేసీఆర్ జనగామ పర్యటన నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడొద్దు

5వ పేజీ తరువాయి

చేతిపంపులు, పైపులైన్ల మరమ్మతులు చేయించాలన్నారు. అవసరం ఉన్న చోట కొత్త పైపులైన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందుకు ప్రత్యేక అభివృద్ధి నిధులతోపాటు డీఎంఎఫ్‌టీ నుంచి గ్రామ పంచాయితీలకు రూ. 3.91 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అధికారులు అందించే నివేదిక ఆధారంగా నిధులు విడుదలవుతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటిని అందించేందుకు ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా గ్రామాల్లో నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

'దొమ్మాటికి టికెట్ కేటాయించాలి'

చిట్యాల, మార్చి 30: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ దొమ్మటి సాంబయ్యకు కేటాయించాలని కాంగ్రెస్ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్యతోపాటు ఏకు రవీందర్, రాజ్‌మహ్మద్, దబ్బెట అనిల్, గడ్డం కోంరయ్య, ఓనపాకల ప్రసాద్, లక్ష్మణ్, బండారి రాజు, రాజమౌళి తదితరులు మాట్లాడారు.

రంగాపూర్ కాల్వను పరిశీలించిన అధికారులు

గోవిందరావుపేట, మార్చి 30: మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామశివారులోని మాదిగమాటు వద్ద రంగాపూర్‌కాల్వకు శనివారం గండిపడగా ఇరిగేషన్ అధికారులు, పోలీసులు పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సహకారంతో గండిని ఇసుక బస్తాలతో పూడ్చి సరిచేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పస్రా సీఐ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పస్రా ఎస్సై కమలాకర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కాటారం, మార్చి 30:ఎ ండలంలోని చిద్నెపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణలు, హనుమాన్ దీక్షాపరుల జైశ్రీరాం.. జైహనుమాన్ నామాలు, వంద లాదిమంది భక్తుల జయజయధ్వానాల మధ్య ఈ కార్యక్రమం కనులపండువుగా సాగింది. వేదపండితుడు సముద్రాల రామాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం హోమం పూర్ణాహుతి గావించారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహప్రతిష్ఠాపనలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు, ఎంపీపీ పంతకాని సమ్మ య్య, ఎంపీటీసీ రవీందర్‌రావు, కాంగ్రెస్ నేతలు పూజలు చేశారు.



ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శ్రీనుబాబు

మానేరుపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలి : ఎమ్మార్పీఎస్

టేకుమట్ల, మార్చి 30: మండలంలోని గర్మిళ్లపల్లి శివారులోని మానేరుపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేరులతో మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమై సుమారు ఐదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా దీనిపై దృష్టిసారించాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

కాటారం, మార్చి 30: మండలంలోని చిద్నెపల్లి గ్రామపంచాయతీ పరిధి బొప్పారంలో శనివారం బుర్రి మల్లయ్య అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. గ్రామంలో ఓ వ్యక్తి ఉదయం చెత్తను కాలబెట్టాడు. మంటలు పూర్తిగా ఆరిపోకపోవడంతో అవి చెలరేగి సమీపంలో ఉన్న మల్లయ్య గడ్డివాముకు అంటుకున్నాయి. భూపాలపల్లి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఆరెకరాల్లోని పశుగ్రాసం కాలిపోయి రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

హనుమాన్ అర్ధమండల దీక్షలు ప్రారంభం

మహదేవపూర్, మార్చి 30: మండలంలోని కాళేశ్వరంలోని హనుమాన్ ఆలయంలో భక్తులు శనివారం దీక్షలు స్వీకరించారు. ఏప్రిల్ 23న హనుమాన్ చిన్న జయంతి ఉండటంతో అర్ధమండల దీక్షలను ఆలయ పూజారి మాడుగుల బాపుశర్మ వేశారు. కాళేశ్వరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులకు మాలధారణ చేశారు. ఆలయంలో రోజూ భజనలు, ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు బాపుశర్మ వివరించారు.

వాహనాల బహిరంగ వేలం

కాటారం, మార్చి 30: వివిధ సంఘటనల్లో పట్టుబడ్డ వాహనాలను మండల కేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో శనివారం బహిరంగ వేలం వేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ నరేందర్ ఏడు బైకులను వేలం వేయగా మొత్తం అమ్ముడుపోయాయి. వేలంలో అప్‌సెట్ ధర రూ.49 వేలు ఉండగా వేలంలో వీటికి జీఎస్టీ సహా రూ.75వేలు ఆదాయం వచ్చిందని కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరిండెంటెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ గుడుంబాను తయారీ, రవాణా చేసినా, దానికి వినియోగించే బెల్లాన్ని తరలించినా కఠిన చర్యలు తప్పవన్నారు. నిషేధిత పదార్థాలను రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో బీఆర్ఎస్ నేతల చేరిక

కాటారం, మార్చి 30:మండలంలోని కాటారం, గారెపల్లి, చిద్నెపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. పెద్దపల్లి ఎంపీ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో బీజేపీలో పనిచేసి అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలని, పెద్దపల్లి ఎంపీగా గోమాస శ్రీనివాస్ గెలవాలని కోరుతూ తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. వారికి గోమాస శ్రీనివాస్, చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.